
సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 7 । జనవరి । 2025



డీఎస్సీ ఖాళీలు భర్తీ చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భాగంగా పూర్తిస్థాయిలో ఖాళీలను భర్తీ చేయాలని డీఎడ్, బీఎడ్ నిరుద్యోగ అభ్యర్థులు కోరారు. డీఈవో ప్రణీతను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.



గిన్నెరకు చేరిన ప్రచార రథం

నాగోబా జాతర పురస్కరించుకుని కేస్లాపూర్‌లో ఈ నెల 3న ప్రారంభమైన ప్రచార రథం సోమవారం మండలంలోని గిన్నెర గ్రామానికి చేరుకుంది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0/10.0

రాత్రి వేళలో చలి ప్రభావం కనిపిస్తుంది. వేకువజామున పొగమంచు కమ్మేయనుంది. అలాగే గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఏసీబీ డీఎస్పీగా పి.విజయ్‌కుమార్



ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: ఏసీబీ డీఎస్పీగా పి.విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు కరీంనగర్ డీఎస్పీ రమణమూర్తి ఇన్‌చార్జి డీఎస్పీగా కొనసాగారు. ఎట్టకేలకు రెగ్యులర్ అధికారి బాధ్యతలు చేపట్టారు. విజయకుమార్ 1995 ఎస్సై బ్యాచ్‌కు చెందినవారు. హైదరాబాద్ సిటీలో ఎస్సైగా, సీఐగా విధులు నిర్వర్తించారు. వికారాబాద్ డీటీసీ వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆయనను జిల్లాకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఇన్‌స్పెక్టర్లు స్వామి, కిరణ్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

11 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఈ నెల 11 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. 11న టైలరింగ్ లోయర్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 12,16 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు టైలరింగ్ హయ్యర్ పరీక్ష, 11,12,16,17 తేదీల్లో డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు ఉదయం 10 నుంచి 12.30, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు.

28వ రోజుకు 'సమగ్ర' సమ్మె



మాట్లాడుతున్న నగేశ్

కైలాస్‌నగర్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె 28వ రోజుకు చేరింది. సర్కారు తీరును నిరసిస్తూ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట గల సమ్మె శిబిరంలో తమ నిరసనను కొనసాగించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య తదితరులు సోమవారం సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పడాల రవీందర్, ప్రియాంక, పార్థసారథి, మల్లిక, భోజన్న, ధరమ్ సింగ్, కేశవ్, దేవదర్శన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఉద్యోగుల సంఘం నాయకుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: సమగ్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్‌ను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, అలాగే హైదరాబాద్‌కు చెందిన ఓ ఉద్యోగిపై అసభ్యకర కామెంట్ చేయడంతో రాచకొండ కమిషనరేట్ పరిధిలో గల మీర్‌పేట్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈమేరకు అక్కడి పోలీసులు సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చారు. మావల మండల కేంద్రంలోని న్యూ హౌసింగ్‌బోర్డులో నివాసం ఉంటున్న ఆయనను విచారణ నిమిత్తం తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, మావల ఎస్సై విష్ణువర్ధన్‌ను అడగగా విచారణ నిమిత్తం తీసుకెళ్తున్నట్లు తమకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. ఆయనను అరెస్టు చేసి తీసుకెళ్లడంతో కుటుంబీకులతో పాటు సమగ్ర ఉద్యోగుల సంఘం నాయకులు ఆందోళన చెందారు.

కలెక్టరేట్ ఎదుట హమాలీల ధర్నా

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హమాలీలు చేపట్టిన సమ్మె ఆరో రోజుకు చేరింది. ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ, పెంచిన కూలి రేట్ల జీవో జారీ చేయాలనే డిమాండ్‌తో సివిల్ సప్లయ్ హమాలీలు ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కూలి రేట్ల పెంపు జీవో జారీ చేయాలని, ఆరోగ్యబీమా కింద రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘ నాయకులు రమేశ్, సలీం, పొచ్చన్న, రాజేందర్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

స్థానిక సంస్థల్లో గెలవాలి

- విభేదాలతో పార్టీ నష్టపోయే పరిస్థితి
- ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- 'హస్తం' శ్రేణులకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ దిశానిర్దేశం
- ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ స్థాయి సమీక్ష

సాక్షి,ఆదిలాబాద్/కైలాస్‌నగర్: 'స్థానిక సంస్థల ఎన్నికల్లో వందకు వందశాతం గెలవాలి.. ఇప్పటి నుంచే సిద్ధం అవ్వండి.. పార్టీ కుటుంబం లాంటిది.. మనస్పర్థలు సహజం.. సమస్యలు ఉంటే చర్చించుకొని ముందుకెళ్లాలి.. విభేదాలతో నష్టపోయే పరిస్థితి ఉంటుంది.. పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయం అవసరం.. ఆ దిశగా పార్టీ ప్రయత్నిస్తుంది.. గాంధీభవన్ తలుపు ఎవరు తట్టినా అందుబాటులో ఉంటా.. కార్యకర్తల్లో కొంత నిరాశ ఉన్న మాట వాస్తవమే.. వచ్చే నాలుగేళ్లలో అందరికీ న్యాయం చేసేలా చూస్తాం' అని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సమావేశం..

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్‌స్థాయి సమావేశం జిల్లా కేంద్రంలోని పద్మనాయక గార్డెన్‌లో సోమవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, రాష్ట్ర మంత్రి సీతక్క, ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథన్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తదితరులు హాజరయ్యారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు మొదలైన సమావేశం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఏడాది పాలన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేసి చూపెట్టిందని మహేశ్‌కుమార్ అన్నారు. అయితే ఆ పార్టీ సోషల్ మీడియా వేదికగా రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తుంది. దీన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది. ఏడాది పాలన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదే. 55వేల ఉద్యోగాలు ఇచ్చాం. సంక్రాంతి నుంచి రైతు భరోసా ఇవ్వబోతున్నాం. కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నాం. వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా కార్యకర్తలు కష్టపడాలని ఆయన అన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ అభివృద్ధికి కృషి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద ప్రణాళిక ఉంది. ఆసియాలోనే అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో పత్తి పండిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికంగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయబోతున్నాం. ఆదిలాబాద్ జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో పాటు వివిధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మహేశ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, రాష్ట్ర మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, నియోజకవర్గ ఇన్‌చార్జీలు శ్రీహరిరావు, కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, శ్యామ్ నాయక్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీ సోయం బాపూరావ్, మాజీ ఎమ్మెల్యేలు రేఖానాయక్, ఆత్రం సక్కు, రాథోడ్ బాపూరావ్, నారాయణరావు పటేల్, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, ఏఐసీసీ సభ్యుడు నరేష్ రాథోడ్, ఆత్రం సుగుణ, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జీసీసీ చైర్మన్‌కోట్నాక్ తిరుపతి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలి



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలి. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలి. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం కావాలి. పార్టీ ఎజెండాతోనే ముందుకెళ్లాలి.

– కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి

పార్టీ విధేయులకే సీట్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విధేయులకే సీట్లు ఇవ్వడం జరుగుతుంది. వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ముఖ్య నేతలపై ఉంది. విభేదాలు వీడి సమన్వయంతో ముందుకెళ్లాలి.

– మంత్రి సీతక్క

అభాండాలు మోపవద్దు

పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసినప్పటికీ ఓడిపోయాం. అయితే కొంత మంది వేరే పార్టీ వారితో ఒప్పందాలు చేసుకొని సొంత పార్టీ నాయకులపైనే అభాండాలు మోపుతున్నారు. మీడియాకు లీక్‌లు ఇస్తూ కథనాలు రాయిస్తున్నారు. అధిష్టానానికి తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు.

– ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉమ్మడి జిల్లా ఓటర్లు.. 23,25,517

- పురుషులతో పోల్చితే మహిళలే అధికం
- నియోజకవర్గాల వారీగా టాప్‌లో మంచిర్యాల..చివరన బెల్లంపల్లి
- తుది జాబితా ప్రకటించిన అధికారులు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటర్ల లెక్క తేలింది. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం-2025లో భాగంగా ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఓటర్ల తుది జాబితాను ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు(కలెక్టర్లు) సోమవారం ప్రకటించారు. ఈ ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 23,25, 517 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 11,37, 514 మంది, మహిళలు 11,87,865 మంది, ఇతరులు 138 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చితే మహిళా ఓటర్ల సంఖ్యనే ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా ఉంది. 50,351 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే మంచిర్యాల నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లుండగా బెల్లంపల్లిలో అత్యల్ప ఓటర్లు ఉన్నారు.

నిర్మల్ నియోజకవర్గంలో అతివలే అధికం..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పురుష ఓటర్లతో పోల్చితే మహిళా ఓటర్ల సంఖ్యనే అధికంగా ఉంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల భవితవ్యాన్ని అతివలే నిర్ణయించనున్నారు. మహిళా ఓటర్లు నిర్మల్ నియోజకవర్గంలో అత్యధికంగా 14,642 మంది ఉండగా అత్యల్పంగా సిర్పూర్‌లో 488 మంది ఉన్నారు. ఇక నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. ముథోల్‌లో 7,850, చెన్నూర్‌లో 2,085, బెల్లంపల్లిలో 2,127, మంచిర్యాలలో 3,115, ఆసిఫాబాద్‌లో 1,998, ఖానాపూర్‌లో 5,392 , ఆదిలాబాద్‌లో 5,755 మంది ఉండగా బోథ్‌లో 6,899 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించిన జాబితా స్పష్టం చేస్తోంది.



సిరికొండ మండలం సుంకిడిలో ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న బీఎల్‌వో

అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో...

అధికారులు ప్రకటించిన ఓటర్ల తుది జాబితాను నాలుగు జిల్లాల కలెక్టరేట్లు, ఉట్నూర్, ఆసిఫాబాద్ సబ్ కలెక్టర్ కార్యాలయాలతో పాటు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ప్రదర్శించారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలతో పాటు బీఎల్‌వోల వద్ద కూడా అందుబాటులో ఉంచనున్నారు.

కొత్తగా 21వేల ఓటర్లు నమోదు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్తగా 21,902 మంది ఓటర్లు పెరిగారు. గతేడాది అక్టోబర్ 29న ప్రకటించిన ముసాయిదా జాబితా నుంచి సోమవారం ప్రకటించిన తుది జాబితా వరకు ఈ సంఖ్య నమోదైంది. అలాగే నాలుగు జిల్లాల పరిధిలో మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన 6,575 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 1475 మంది ఓటర్లను తొలగించగా, కొత్తగా 4,984 మంది కొత్తగా ఓటు హక్కు పొందారు. మంచిర్యాలలో 2,282 మంది ఓటర్లను తొలగించగా, 5,216 మందిని ఓటర్లుగా కొత్తగా చేర్చారు. ఆదిలాబాద్ జిల్లాలో 1898 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించగా, 5,430 మందిని కొత్తగా చేర్చారు. నిర్మల్ జిల్లాలో 920 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించగా, కొత్తగా 6,272 మంది ఓటు హక్కు పొందారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్‌కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	320	1,15,323	1,15,811	16	2,31,150
చెన్నూర్	230	96,964	99,049	07	1,96,020
బెల్లంపల్లి	227	88,109	90,286	13	1,78,408
మంచిర్యాల	290	1,39,306	1,42,421	26	2,81,753
ఆసిఫాబాద్	358	1,13,815	1,15,813	16	2,29,644
ఖానాపూర్	308	1,11,157	1,16,549	14	2,27,720
ఆదిలాబాద్	292	1,21,050	1,26,805	06	2,47,861
బోథ్	303	1,03,554	1,10,453	02	2,14,009
నిర్మల్	306	1,23,088	1,37,730	21	2,60,839
ముథోల్	311	1,25,148	1,32,948	17	2,58,113

కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ఇంద్రవెల్లి ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

ఇంద్రవెల్లి: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఏఎంసీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ ఆధ్వర్యంలో చైర్మన్ ముఖడే ఉత్తం, వైస్‌చైర్మన్ సోయం మారుతితో పాటు డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని ఎమ్మెల్యే సనాన్మించి మాట్లాడారు. పదవులు రాని వారు నిరాశ చెందవద్దని, రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలకు అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, మార్కెట్ కార్యదర్శి దేవన్న, పీఏసీఎస్ చైర్మన్ మారుతి పటేల్ తదితరులు పాల్గొన్నారు.



నూతన ఏఎంసీ పాలకవర్గంతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తదితరులు

డీఈవో ప్రణీతకు గుండెపోటు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత గుండెపోటుతో ఆసుపత్రిలో చేరారు. సోమవారం రాత్రి ఇంటి వద్ద ఆమెకు గుండెపోటు రావడంతో కుటుంబీకులు వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డీఈవో ప్రణీత →



మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

- ఆదిలాబాద్ భద్రత అందరి బాధ్యత
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- రిమ్స్‌లో మైత్రి కేంద్రం, సూపర్‌స్పెషాలిటీలో మహిళా క్యాంటీన్ ప్రారంభం
- రూ.30.17కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్/ఆదిలాబాద్‌రూరల్: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. జిల్లాకు విచ్చేసిన మంత్రి సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో బిజీబిజీగా గడిపారు. జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో రూ.75లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా వికాస జిల్లా సమాఖ్య నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు రూ.102 కోట్ల విలువైన చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. అలాగే ఆదిలాబాద్ పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.10.50 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు దస్నాపూర్‌లో భూమిపూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు మావల మండల కేంద్రంలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. దుబ్బగూడలో రూ.కోటి 43లక్షల వ్యయంతో నిర్మించనున్న పీహెచ్‌సీ భవన పనులను ప్రారంభించారు.



మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ విఠల్ తదితరులు

ఆదిలాబాద్ భద్రత.. అందరి బాధ్యత

ఆదిలాబాద్ భద్రత అందరి బాధ్యత అని మంత్రి సీతక్క అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత జైనథ్ సర్కిల్ పరిధిలో పోగొట్టుకున్న 20 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. రవాణా, పోలీసు శాఖ ద్వారా పలువురు వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. మోటార్ సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఆదిలాబాద్ పట్టణ ప్రజల సంరక్షణార్థం పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. కుమురంభీం కాలనీలో ఉంటున్న ఆదివాసీలకు ఇళ్ల స్థలాలతో పాటు సౌకర్యాలు కల్పించాలని తుడుందెబ్బ నాయకులు మంత్రికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీటీసీ రవీందర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు మంత్రి సన్మానం..

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలంను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రజల సమస్యలపై తక్షణం స్పందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే పనిచేయాలని సూచించారు.

మంత్రికి వినతులు..

ఆదిలాబాద్ జిల్లాకు ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను జిల్లా కేంద్రంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పట్టణంలోని కుమురంభీం కాలనీలో నివాసముంటున్న నిరుపేద ఆదివాసీలకు గృహజ్యోతి పథకం కింద విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని తుడుందెబ్బ నాయకులు కోరారు. వినతిపత్రం అందజేశారు.

ట్రాన్స్‌జెండర్లపై వివక్ష చూపొద్దు

సమాజంలో ఓ భాగమైన ట్రాన్స్‌జెండర్లపై వివక్ష చూపవద్దని మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ట్రాన్స్‌జెండర్లు తమకు గుర్తింపు కార్డులను అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని విన్నవించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఆదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యేలు గోడం నగేశ్, పాయల్ శంకర్ మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఆర్డీవో వినోద్‌కుమార్, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో రవీందర్ రాథోడ్, కౌన్సిలర్ అంబకంటి అశోక్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణ, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం..

రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. అంతకుముందు ఆస్పత్రిలోని పలు వార్డులతో పాటు యంత్ర పరికరాలను పరిశీలించారు. క్యాంటీన్‌ను ప్రారంభించి ఆహార పదార్థాల రుచి చూశారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ వైద్యుల నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కాగా రిమ్స్ ఆస్పత్రి ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మంత్రికి వినతి పత్రం సమర్పించారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఆ సంఘం అధ్యక్షుడు శ్రీను, బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆహారపదార్థాలు రుచి చూస్తున్న మంత్రి సీతక్క

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతి

సోన్: మండలంలోని ఐబీ చౌరస్తా వద్ద ట్రాక్టర్ ఢీకొని పాక్‌పట్ల గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాసిం (52) మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రం నుంచి మాదాపూర్ పెట్రోల్ బంక్ వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ సంతోష్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి రోడ్డు దాటుతున్న ఖాసింను బలంగా ఢీ కొట్టాడు. దీంతో ఖాసింకు తీవ్రమైన గాయాలు కాగా అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి అన్న గోరేమియా ఫిర్యాదు మేరకు ఎస్సై కే. గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు..

నేరడిగొండ: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడడంతో సుధాకర్ (27) అనే యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. నాగమల్యాల్ గ్రా మానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ గయి భీముడు కుమారుడు సుధాకర్ సోమవారం తన ట్రాక్టర్‌లో గ్రామ సమీపంలో గల వాగులో నుంచి ఇసుకను తరలించే క్రమంలో గోవింద్‌పూర్ గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడింది. ట్రాక్టర్ టైర్ కింద పడి సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

నర్సాపూర్(జి): 61వ జాతీయ రహదారిపై మార్నింగ్ వాక్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను వెనుక నుంచి కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలైన ఘటన సోమవారం ఉదయం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన ఉజిగిరి గణపతి, ఆవుల్దపూర్ గంగారెడ్డిలు సోమవారం ఉదయం 5 గంటలకు జాతీయ రహదారిపై మార్నింగ్ వాక్ చేస్తూ నిర్మల్ వైపు వెళ్తున్నారు. భైంసా నుంచి నిర్మల్ వైపు వేగంగా వెళ్తున్న కారు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వీరిద్దరిని వెనుక నుంచి ఢీ కొట్టడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో ఉజిగిరి గణపతికి ఎడమకాలు విరగ్గా చేతులకు, తలకు గాయాలయ్యాయి. గంగారెడ్డి చేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. ఉజిగిరి గణపతి తమ్ముడు ఉజిగిరి సాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీడని మర్డర్ మిస్టరీలు!



- నెల రోజుల క్రితం జిల్లా కేంద్రంలో మహిళ హత్య
- నాలుగేళ్ల క్రితం ఒకరు.. ఏడేళ్ల క్రితం మరొకరు హత్య
- పోలీసులకు సవాల్ విసురుతున్న మర్డర్లు

జిల్లాలో జరిగిన కొన్ని హత్యలు మిస్టరీగా మిగిలిపోయాయి. ఒక హత్య ఘటనలో హంతకులు దొరకడం లేదు.. మరో ఘటనలో హంతకులు దొరికినా.. హత్యకు గురైన వ్యక్తి మృతదేహం లభించడం లేదు. ఇంకో ఘటనలో హత్యకు గురైంది ఎవరు..? హత్య చేసింది ఎవరు..? అనేది నేటికీ తెలియడం లేదు. జిల్లాలో వెలుగులోకి వచ్చిన ఈ మూడు హత్య కేసులు పోలీసులకు పెను సవాల్‌గా మారాయి. సాంకేతికతను ఉపయోగించి అనేక కేసులు ఛేదించిన పోలీసులు జిల్లాలో జరిగిన ఈ మూడు హత్య కేసులను ఛేదించడంలో మాత్రం విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. నేరస్తులు కూడా పోలీసులకు చిక్కకుండా జాగ్రత్త పడుతూ, హత్య జరిగిన చోట సైంటిఫిక్ ఆధారాలు లభించకుండా నేరాలకు పాల్పడుతున్నారు. పోలీసుల కళ్లు గప్పి యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు. – మంచిర్యాలక్రైం

హత్యకు గురైంది ఎవరో.. ? హత్య చేసింది ఎవరో.. ?

జిల్లా కేంద్రంలోని గోదావరి రైల్వే బ్రిడ్జి కింద అక్టోబర్ 14, 2018న హత్యకు గురైన ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అప్పటికే మృతదేహం గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. స్థానికులు అందించిన సమచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిసర ప్రాంతాలను పరిశీలించగా అక్కడికి కొంత దూరంలో హత్య చేసి రైల్వేబ్రిడ్జి పిల్లర్ల మధ్య పడేసినట్లు పోలీసులు ఆనవాళ్లను గుర్తించారు. అనంతరం హత్య కేసుగా నమోదు చేశారు. అయితే హత్యకు గురైన వ్యక్తి ఎవరు.. ఎవరు హత్య చేసి ఉంటారు..? అనే విషయాలు తెలుసుకునేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేశారు. హత్యకు గురైన వ్యక్తి ఎవరనేది తేలితే హంతకులను సులువుగా పట్టుకోవచ్చని భావించిన పోలీసులు మృతదేహానికి సంబంధించిన ఫొటోలు రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించారు. ఎక్కడ నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో హత్యకు గురైంది ఎవరనేది నేటికీ తెలియడం లేదు.

ఎవరూ తప్పించుకోలేరు..



నేరం చేసిన వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరు. చట్టం అందరికీ సమానమే. హత్య, దొంగతనం, ఆత్మహత్యలకు సంబంధించిన కేసుల్లో సరైన ఆధారాలు లభించకపోవడం వల్ల కొన్ని సందర్భాల్లో కేసుల విచారణ ఆలస్యమవుతోంది. హత్య, ఆత్మహత్యల కేసుల్లో సంబంధిత కుటుంబ సభ్యులు పోలీసులకు సహకరిస్తే విచారణ త్వరగా ముగుస్తుంది. ఎలాంటి ఆధారాలు లభించకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సంబంధిత కేసును పెండింగ్‌లో పెడుతాం. – ఆర్. ప్రకాశ్, ఏసీపీ, మంచిర్యాల

నెల క్రితం మహిళ హత్య..

జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్న లక్షెట్టిపేట మండలం జెండ వెంకటపూర్ గ్రామానికి చెందిన కూ స లక్ష్మి (55)ని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి తాళం వేసి వెళ్లిపోయారు. చుట్టుపక్కల వారికి దుర్గంధం రావడంతో స్థానికులు న వంబర్ 30, 2024న పోలీసులకు సమాచా రం అందించారు. పోలీసులు ఘటన స్థలా నికి చేరుకొని తలుపు తాళం పగలగొట్టి చూడగా లక్ష్మి మృతదేహం కన్పించింది. హత్య కేసుగా నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. హత్య ఘ టన వెలుగులోకి వచ్చి నెల రోజులు గడిచి నా హంతకులు ఎవరనేది తెలియడం లేదు. హత్య ఘ టనలో ఎలాంటి ఆ. దారాలు లభించక పోవడంతో హత్య కేసును ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారింది.



లక్ష్మి (ఫైల్)

నేటికీ లభించని మృతదేహం..



రవికుమార్ మృతదేహం కోసం జేసీబీతో చెరువులో తవ్వకాలు జరుపుతున్న పోలీసులు(ఫైల్)

జిల్లాలోని లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020, జూన్ 2న రవికుమార్ హత్యకు గురయ్యాడు. రవికుమార్ చెల్లెలు దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మొబైల్ డేటా ఆధారంగా హత్య కేసులో హత్యకు పాల్పడిన వారిని గుర్తించి అక్టోబర్, 2021లో అరెస్ట్ చేశారు. రవికుమార్‌ను హత్య చేయించిన తన భార్య శైలజ, సుఫారి తీసుకుని హత్యకు పాల్పడిన గంగరాజం, సాయికుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామంలోని చెరువు సమీపంలో రవికుమార్ తలపై బండతో మోది మృతదేహాన్ని చెరువులో పడేసినట్లు వివరించారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. హంతకులను పట్టుకున్న సమయంలో వర్షాకాలం కావడంతో చెరువులో మృతదేహాన్ని వెతకడం వీలు కావడం లేదని పోలీసులు వెల్లడించారు. ఇటీవల చెరువులో నీరు లేకపోవడంతో అనుమానిత ప్రాంతంలో జేసీబీతో పోలీసులు తవ్వకాలు జరిపారు. అయినా రవికుమార్ మృతదేహం లభించక పోవడం గమనార్హం. హత్య కేసులో కీలక ఆధారమైన మృతదేహం నాలుగేళ్లయినా లభించడం లేదు.

గిన్నెరకు చేరిన ప్రచార రథం

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా జాతర పురస్కరించుకుని కేస్లాపూర్ నాగోబా మూరాడి నుంచి ఈ నెల 3న ప్రారంభించిన ప్రచార రథం సోమవారం మండలంలోని గిన్నెర గ్రామానికి చేరుకుంది. ఈ నెల 7న ఉట్నూర్ మండలంలోని సాలేవాడ, ఈ నెల 8న ఇంద్రవెల్లి మండలంలోని వడగామ్ గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, ఈ నెల 9న తిరిగు ప్రయాణంలో కేస్లాపూర్ గ్రామానికి చేరుకోనుంది. ఈనెల 10న ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులు కేస్లాపూర్ గ్రామంలో ఉన్న నాగోబా మురాడి వద్దకు చేరి పవిత్ర గంగా జలం పాదయాత్రను ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

అటవీఅధికారులపై దాడి.. పలువురిపై కేసు

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఆదివారం అటవీశాఖ అధికారులపై దాడి చేసిన ఘటనలో పలువురు మూల్తానీలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. కేశవపట్నం గ్రామానికి చెందిన కొంత మంది కలప స్మగ్లర్ల ఆచూకీ కోసం వెళ్లిన అటవీశాఖ అధికారులపై దాడి చేసిన ఘటనలో షేక్ జైను, షేక్ అతుల్, షేక్ పిద్దుల్, షేక్ ముజ్జు, షేక్ అఫ్రోజ్, షేక్ వాసిం, షేక్ జావుల్, షేక్ కరీం, షేక్ హసన్‌తో పాటు మరి కొంతమందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన నికాడే శంకర్(63) అనే వృద్ధుడు సోమవారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. శంకర్ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న శంకర్ ఇంటి ఆవరణలోని బావి నుంచి నీరు తోడే ప్రయత్నం చేశాడు. ప్రమాదవశాత్తు శంకర్ కాలుజారి బావిలో పడడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్ చరిత్ర ఘనం



ప్రదర్శనలో పురాతన వస్తువులు



చరిత్రను వివరిస్తున్న కటకం మురళి

- కొనసాగుతున్న నిర్మల్ ఉత్సవాలు
- జిల్లా చరిత్ర తెలియజేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ కటకం మురళి
- ఆకట్టుకుంటున్న పురాతన వస్తువుల స్టాల్

నిర్మల్‌ఖిల్లా: స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 5న ప్రారంభమైన నిర్మల్ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో నిర్మల్ చరిత్ర, గత వైభవం, జిల్లాకున్న విశిష్ట ప్రాశస్త్యం, జిల్లా కేంద్రానికి చెందిన చరిత్ర పరిశోధకుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కటకం మురళి వివరిస్తున్నారు. నిర్మల్ జిల్లా గత వైభవం పరిపాలన కాలంలో ఆయుధ భాండాగారం, కోటలు, బురుజులు, ఖిల్లాలు, గొలుసుకట్టు చెరువులు అభివృద్ధి చేసిన అలనాటి పరిపాలకుల చరిత్రను దృశ్యకావ్యంగా వివరించిన తీరు ఆకట్టుకుంటోంది. మూడు రోజులపాటు కొనసాగుతున్న ఉత్సవాలు మంగళవారం ముగుస్తుండగా ప్రతీరోజు గంటపాటు జిల్లా చరిత్రను తెలియజేస్తున్నారు. నిర్మల్ వెలుగొందిన తీరు, అలనాటి ఘన చరిత్రను నేటి తరానికి తెలియజేసే ప్రయత్నం చేస్తున్నట్లు కటకం మురళి 'సాక్షి'తో పేర్కొన్నారు. శాతవాహనుల కాలం నుంచి బౌద్ధమతం విరాజిల్లిన పరిస్థితులు, తదనంతర కాలంలో నిర్మల్‌ను కేంద్రంగా చేసుకుని పరిపాలించిన రాజులు, నిమ్మనాయుడు కాలం, ఆధునిక చరిత్రలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ,నూతన జిల్లా ఏర్పాటు వంటి అంశాలను వివరించారు.

జనబాహుళ్యంలోకి చరిత్ర..

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ ఉత్సవాల పేరిట జిల్లా చారిత్రక వైభవాన్ని జనబాహుళ్యంలోకి తెచ్చేవిధంగా చేస్తున్న ప్రయత్నం అత్యంత ప్రశంసనీయమని సంస్కృత భాషా ప్రచార సమితి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ పద్యకవి బి. వెంకట్ అన్నారు. సోమవారం జిల్లాకు చెందిన ప్రముఖ కవులు, సాహితీవేత్తలు కారం శంకర్, డాక్టర్ మురళీధర్, మునిమడుగుల రాజారావు, తొడిశెట్టి పరమేశ్వర్, ఉప్పు కృష్ణంరాజు తదితరులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉత్సవాల నిర్వహణకు కృషిచేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ఇవిగో ఆనవాళ్లు..

నిర్మల్ ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లలో జిల్లా చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదను చాటే పురాతన వస్తువులను ప్రదర్శిస్తున్నారు. జిల్లా గత వైభవం, ఆనాటి ప్రజల జీవన విధానం ఉట్టిపడే విధంగా, గత చరిత్రను స్ఫురణకు తెచ్చే విధంగా స్టాల్ నంబర్ 21 ఆకట్టుకుంటోంది. సోమవారం సాయంత్రం ఈ స్టాల్స్‌లలో ప్రదర్శనకు ఉంచిన పాతాళగరిగె, కొప్పెర, గంగాళం, పాత తరంలో వినియోగించిన రుబ్బురోలు, కందిలి, ధాన్యాన్ని కొలిచే సోలా, అరసోలా, ఇతర గృహ వినియోగ ఇత్తడి సామన్లను ఆసక్తితో తిలకిస్తున్నారు. తొలితరం వారు వినియోగించిన రాతి పనిముట్లు, ముచ్చట గొలిపే శిల్పాలు, సౌందర్య కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి. అప్పాల కావేరి ఫౌండేషన్, మానస సాహితీ సేవాసంస్థ నిర్వాహకులు తుమ్మల దేవరావు వీటి గురించి వివరించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

- 5 వ తరగతి నుంచి 9వ తరగతి వరకు..

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్):తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 9 వతరగతి ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష టీజీసెట్ -2025కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జోనల్-2 ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాలలో రూ.1.50 లక్షలలోపు ఉండాలని సూచించారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు www. tswreis. ac. in లేదా http:// tgcet. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 23 ఫిబ్రవరి 2025న జరిగే టీజీసెట్ -2025 ప్రవేశ పరీక్షలో కనబర్చిన ప్రతిభ, విద్యార్థులు ఎంపిక చేసుకున్న పాఠశాలల ప్రాధాన్యత ప్రకారం ప్రవేశాలు ఉంటాయన్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు తుదిగడువు 2025, ఫిబ్రవరి 1 అని జోనల్ ఆఫీసర్ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీ కొట్టిన ఘటన చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన రమేశ్ కూతురు అపూర్వ మండలంలోని బంగారుగూడ మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతుంది. రోజూ మాదిరిగానే రమేశ్ సోమవారం సాయంత్రం కూతురును ద్విచక్ర వాహనంపై తీసుకువస్తున్న క్రమంలో బంగారుగూడ వంతెన సమీపంలో టిప్పర్ డ్రైవర్ ఇస్తాక్ అన్సరీ అజాగ్రత్తతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. వాహనం ముందు భాగం నుజ్జునుజ్జు కాగా తండ్రి, కూతురుకు గాయాలయ్యాయి. కాగా తృటిలో వారికి పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు చికిత్స కోసం వారిని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోతుల పునరావాసం పునఃప్రారంభం



పట్టి తెచ్చిన కోతులకు మత్తు తెప్పించే ఆహారం ఇస్తున్న అధికారులు

- వీడీసీలు చొరవ తీసుకుని కోతులను పంపాలంటున్న అధికారులు
- అవసరమైతే కేజ్‌లు పంపిణీ చేస్తామని వెల్లడి

సారంగపూర్(నిర్మల్): ఆహారం కోసం వనం వీడి జనంలోకి వస్తున్న కోతులను కట్టడి చేసి వాటి పునరుత్పత్తి ప్రక్రియ నిలుపుదల చేయడానికి నిర్మల్ జిల్లాలో నిర్మించిన కోతుల పునరావాస కేంద్రం కొద్దిరోజులుగా నిరుపయోగంగా మారింది. సీసీఎఫ్ శరవణన్, జిల్లా అటవీశాఖ అధికారి రామకృష్ణ ఆదేశాల మేరకు సోమవారం కోతుల పునరావాస ప్రక్రియను పునఃప్రారంభించారు. ఈమేరకు స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకర్ రాజును ఇన్‌చార్జి అధికారిగా నియమించి ట్యూబెక్టమి, వ్యాసెక్టమీ ఆపరేషన్ల ప్రక్రియను పునరుద్ధరించారు. సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి 90 కోతులను పట్టి తెప్పించి వాటికి ఆపరేషన్లు నిర్వహించారు.

వీడీసీలు ముందుకొస్తే...

గ్రామాల్లో కోతుల బెడద నివారించేందుకు వీడీసీలు మెముసైతం అన్నట్లుగా తమ వద్దగల కొన్ని నిధులను కోతులను పట్టించడానికి వినియోగిస్తే వాటిని బంధించడానికి అవసరమైన పంజరాలను అందిస్తామని అంటున్నారు.

పంచాయతీ అధికారులు స్పందించాలి

జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట కోతులు దాడిచేసిన ఘటనలో ఒకరిద్దరు గాయాలపాలవుతున్నారు. ఈక్రమంలో పంచాయతీ సిబ్బంది సైతం స్పందించి కోతుల బెడదను నివారించడానికి గ్రామపంచాయతీ ట్రాక్టర్లు వినియోగించి కోతులను పునరావాస కేంద్రానికి తరలించేందుకు సహకరించాలని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అందరి బాధ్యత

గ్రామాల్లో కోతుల బెడద విపరీతంగా పెరిగింది. ఇటు ప్రజలు, అటు పంటలపై దాడిచేసి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇది దృష్టిలో ఉంచుకునే కోతుల పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే శస్త్ర చికిత్సలు చేసే పశువైద్యాధికారులు అందుబాటులో లేక పునరావాస కేంద్రం కొంతకాలం మూసి ఉంది. అధికారుల ఆదేశాల మేరకు పునఃప్రారంభించాం. – నజీర్‌ఖాన్, డీఆర్‌వో, సారంగాపూర్

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లకు అలవాటుపడి డబ్బులు పోగొట్టుకున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ మండలం పిప్పర్‌వాడ గ్రామానికి చెందిన అలిశెట్టి సురేశ్ కుమారుడు అలిశెట్టి సాయి (23) గత కొంత కాలంగా అభ్యుదయ పాఠశాలలో వంట మనిషికి సహాయకుడిగా పనిచేస్తున్నాడు. రాత్రి సమయంలో పాఠశాలలోనే నిద్రపోయేవాడు. గత కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌కు అలవాటు పడ్డాడు. డబ్బులు పోగొట్టుకోవడంతో జీవితంపై విరక్తి చెంది పాఠశాలలో ఉదయం 5 గంటల ప్రాంతంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన పాఠశాల యాజమాన్యం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ఉట్నూర్‌రూరల్: మద్యానికి బానిసైన వ్యక్తి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండలం ఏందా గ్రామానికి చెందిన రవీందర్ (42) కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆయన భార్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మృతితో ఒంటరితనానికి గురై మద్యానికి బానిసయ్యాడు. కాగా ఆదివారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే క్రమంలోనే మృతి చెందాడు. దీంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. తండ్రి మృతదేహం వద్ద పిల్లల రోధనలు పలువురిని కలిచివేశాయి. మృతుడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



అవినాష్‌రెడ్డి (ఫైల్)

చెన్నారావుపేట: విద్యుదాఘాతంతో ఫార్మసీ విద్యార్థి మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధి మగ్దుంపురం గ్రామంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లాకు చెందిన విద్యార్థి అవినాష్‌రెడ్డి (18) మగ్దుంపురం గ్రామంలోని జయముఖి కళాశాలలో ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. హాస్టల్‌లో మోటారు పనిచేయకపోవడంతో వార్డెన్ వివేక్ అవినాష్‌రెడ్డిని తీసుకెళ్లి మోటారు చూడమని చెప్పినట్లు తెలుస్తోంది. మోటారు పనిచేస్తుందా లేదా అని పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన వార్డెన్ కరెంట్ సరఫరాను నిలిపివేసి స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అవినాష్‌రెడ్డి మృతి చెందాడు. వార్డెన్ తప్పిదంతోనే అవినాష్‌రెడ్డి మృతిచెందాడని స్నేహితులు తెలిపారు. కాగా తల్లిదండ్రులు, మిత్రులు కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై ఎస్సై రాజేశ్‌రెడ్డిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

చైనా మాంజాతో ఇద్దరికి గాయాలు



గొంతుకు గాయంతో చంద్రవిలాస్

ఖానాపూర్: చైనా మాంజాతో సోమవారం పట్టణానికి చెందిన ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పరిమి చంద్రవిలాస్‌తో పాటు కడెం మండలం మాసాయిపేట్‌కు చెందిన ఎట్టం ఎర్రన్న విద్యానగర్ నుంచి బస్టాండ్‌కు వేర్వేరుగా ద్విచక్రవాహనాలపై వచ్చే క్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రధాన రహదారిపై మాంజా దారం అడ్డుగా వచ్చింది. దీంతో చంద్రవిలాస్ గొంతుకు మాంజా కోసుకుపోవడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. అదే సమయంలో మాంజాను గమనించి ఎర్రన్న చేతితో మాంజాను అడ్డుకునే ప్రయత్నం చేయగా చేతి వేళ్లకు గాయమైంది. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎస్సై కొట్టాడని బాలుడు ఆత్మహత్యాయత్నం

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చితకబాదాడని ఆరోపిస్తూ ఓ మైనర్ బాలుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. డిసెంబర్ 15వ తేదీన కన్నెపల్లి మండల కేంద్రం నుంచి రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని ఆటోను, రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఓ బాలుడితో పాటు అతని బావ రమేశ్‌లపై కేసు నమోదు చేశారు. ఆటోను విడిపించుకునేందుకు బాలుడితో పాటు రమేశ్‌లు గత వారం రోజులుగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం బాలుడు పోలీస్‌స్టేషన్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. దీంతో బాధితుడిని కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఎస్సై గంగారాం తమను చితకబాదాడని, డబ్బులు సైతం డిమాండ్ చేశాడని బాలుడు, రమేశ్‌లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సై గంగారాంను వివరణ కోరగా తాము ఎలాంటి వేధింపులకు గురి చేయలేదని, రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో సీజ్ చేసిన ఆటోను విడిపించుకునేందుకే పోలీస్‌స్టేషన్‌కు బాలుడితో పాటు రమేశ్ వచ్చారన్నారు. కోర్టు నుంచి రిలీజింగ్ ఆర్డర్ వచ్చాక ఆటోను విడుదల చేస్తామని వారితో చెప్పినట్లు తెలిపారు.